ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
ఉదయం
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 176 | పేజీలు: 6 | వెల: రూ.3/- | శనివారం 3 అక్టోబర్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

## రాష్ట్రవ్యాప్తంగా
# సెంట్రల్ కిచెన్ల ఏర్పాటు

విద్యార్థుల కోసం ప్రతిష్ఠాత్మక బ్రేక్‌ఫాస్ట్ పథకం

డిసెంబర్ 9 నుంచి ప్రభుత్వ స్కూళ్లలో అమలు

సరికొత్త కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం

కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు సంస్థల సాయం

నిత్యం 25 లక్షల మందికి పౌష్టికాహార టిఫిన్

పలు సంస్థలతో సీఎం సమక్షంలో ఒప్పందం





**హైదరాబాద్, అక్టోబర్ 2 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని విస్తరించనుంది. డిసెంబర్ 9వ తేదీన అన్ని జిల్లాల్లో సెంట్రల్ కిచెన్స్ సేవలను ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ బృహత్తర కార్యక్రమం ద్వారా ప్రతిరోజూ 25 లక్షల మందికి పైగా విద్యార్థులకు ఉదయం వేళ బలవర్ధకమైన, పరిశుభ్రమైన అల్పాహారం లభిస్తుంది. నవంబర్ 30 నాటికి వంటశాలల నిర్మాణ పనులన్నీ పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. ఆహార నాణ్యత, పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఈ కిచెన్లను హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానిస్తారు. పిల్లలకు అందించే ఆహారంలో ఉండే క్యాలరీల స్థాయిని ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా రోజువారీగా ట్రాక్ చేస్తారు. స్థానిక ఆహారపు అలవాట్లను గౌరవిస్తూనే సంపూర్ణ పోషకాలతో కూడిన మెనూను ఖరారు చేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించే బృహత్తర ప్రాజెక్టు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఫౌండేషన్‌తో జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు అధికారిక ఒప్పందం కుదుర్చుకున్నాయి. నాగర్‌కర్నూల్ సెంట్రలైజ్డ్ కిచెన్ నిర్మాణం కోసం జున్నా సోలార్ సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈఓ అనిల్ బాబు రూ. 5.17 కోట్ల చెక్కును అందించారు. వికారాబాద్



## ఎన్నికల సంఘం
# కీలక నిర్ణయం

### సర్‌లో తొలగించిన అర్హులకు ఓటు
### స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశాలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 2 (ప్రభాత ఉదయం)**

ఎస్ఐఆర్‌పై వివాదం వేళ కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఓటర్ల జాబితా సవరణ పూర్తైన ప్రాంతాలలో తొలగించిన, విస్మరించిన అర్హులైన కొత్త ఓటర్లను తక్షణమే ఓటరు జాబితాలో చేర్చేందుకు ఒక ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించాలని రాష్ట్ర ఎన్నికల అధికారులను ఆదేశించింది. దీంతో తాజాగా సర్ ప్రక్రియలో తొలగించిన ఓట్లు మళ్లీ ఓటర్ల జాబితాలో చేరనున్నాయి. అలాగే కొత్తగా 18 ఏళ్లు నిండినవారు తొలిసారి ఓటు నమోదు చేసుకునేందుకు అవకాశం లభించనుంది. ఎస్ఐఆర్ ప్రక్రియపై దేశవ్యాప్త ఆందోళనలు, నిరసనల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం దిగొచ్చింది. చట్ట విరుద్ధంగా ఓట్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదులో అవకతవకలు జరిగాయంటూ సర్ ప్రక్రియను యువత, ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో వ్యతిరేకించడంతో ఈసీ గతంలో తీసుకున్న నిర్ణయాలను ఒక్కొక్కటిగా వెనక్కి తీసుకుంటోంది. ఇటీవల ఫారం-6 రూల్స్‌లో మార్పులు చేసింది.

**ఇదొక నిరంతర ప్రక్రియ : కేంద్ర ఎన్నికల సంఘం**

ఓటర్ల నమోదు అనేది ఒక నిరంతర ప్రక్రియ అని కేంద్ర ఎన్నికల సంఘం అభిప్రాయపడింది. ఎస్ఐఆర్ సమయంలో ఓటు నమోదు చేయలేదనే కారణంతో ఏ ఒక్క అర్హత గల పౌరుడి ఓటు హక్కును కూడా హరించకూడదని పేర్కొంది.



స్వాతంత్ర్య సమర యోధులకు సన్మానం చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వీసీ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య లు

## వ్యవసాయ విశ్వవిద్యాలయంలో
# ఘనంగా మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీల జయంతి వేడుకలు

### రైతాంగానికి కొత్త టెక్నాలజీ లను అందించాలి: వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు

**బుద్వేల్, అక్టోబరు 2 (ప్రభాత ఉదయం) :**

రైతాంగానికి చేదోడు వాదోడు గా ఉంటు వారికి నూతన టెక్నాలజీలను అందించి అధిక దిగుబడులు సాదించి స్థిర ఆదాయం పొందేలా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారులు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం లో శుక్రవారం జరిగిన జాతిపిత మహాత్మాగాంధీ 157వ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రీ 122వ జయంతి వేడుకలలో ఆయన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ ప్రకాష్ గౌడ్, స్వాతంత్ర్య సమర యోధులు ఉన్నం వెంకయ్య, జి నర్సయ్య, వెంకటేశ్వర్ రావు, గాంధేయన్ స్కాలర్, హై కోర్టు న్యాయవాది ఏ రఘు కుమార్, వర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య లతో కలసి పాల్గొన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్యను మంత్రి అభినందించారు. ఈలాంటి మహనీయులు త్యాగాలను, పద్ధతులను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీల్చడానికి మహాత్మాగాంధీ అహింసా పోరాటం, త్యాగాలే కారణమన్నారు. ఆనాటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రీ చేతుల మీదుగా ఏర్పాటు అయిన ఈ వ్యవసాయ విశ్వవిద్యాలయం నేడు దేశంలోనే వ్యవసాయ రంగానికి తలమానికంగా నిలిచిందని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అభినందించారు. రైతాంగానికి మేలు చేసి నవ భారతానికి నాంది పలుకాలని శాస్త్రవేత్తలకు, విద్యార్థులకు సూచించారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, మహాత్మా గాంధీ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరు నడచుకోవాలన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వర్శిటీ వైస్ చాన్సలర్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ, నేటి యువత లో స్వాతంత్ర్య పోరాట చరిత్ర పై అవగాహన కల్పించడం కోసమే మహాత్మాగాంధీ జయం తి కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వారిని సన్మానించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# "ప్రభాత ఉదయం" వార్తకు స్పందన

**పటాన్ చెరు, అక్టోబర్ 2 (ప్రభాత ఉదయం):**

ఖాకీ, ఖద్దరు నీడలో "దళారీ" రాజ్యం అనే శీర్షికన శుక్రవారం ప్రభాత ఉదయం దినపత్రికలో ప్రచురితమైన వార్తా కథనానికి స్పందన లభించింది. శుక్రవారం రాత్రి సమయంలో కొందరు ప్రైవేటు వ్యక్తులు సుమారు 4 ఎకరాల భూమిలో ఏర్పాటు చేసిన రేకులను తొలగించే ప్రక్రియ మొదలు పెట్టారు. చీకటి పడిన అనంతరం జెసిబి సహాయంతో పాటు మరికొన్ని వాహనాలు ఉపయోగించి తొలగింపు ప్రక్రియ మొదలు పెట్టారు. అదేవిధంగా ఆ భూమికి ఆనుకుని ఉన్న ఓ పరిశ్రమలో సైతం




సుమారు 15 గుంటల అసైన్డ్ భూమి ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. రేకుల తొలగించడంతో సదరు పరిశ్రమ



ప్రాంతంలో ఉన్న అసైన్డ్ భూమిని స్వాధీనం చేసుకుని సంబంధిత రైతులకు న్యాయం చేయాలని స్థానికుల నుండి డిమాండ్ వినిపిస్తోంది.

**జిల్లా అధికారులు స్పందించాలి-రైతులకు న్యాయం చేయాలి**

రైతులను భయభ్రాంతులకు గురి చేసి తక్కువ రేటుకు దళారులు భూములను చేజిక్కించుకుంటున్న నేపథ్యంలో



రైతులు,స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. శుక్రవారం "ప్రభాత ఉదయం" దినపత్రికలో ప్రచురితమైన వార్తా కథనాన్ని సంగారెడ్డి జిల్లా ఉన్నతాధికారులకు గడ్డపోతారం కు చెందిన కొందరు స్థానికులు చేరవేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ అంశంపై జిల్లా ఉన్నతాధికారులు మరింత లోతుగా పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని సర్వత్రా డిమాండ్ చేస్తున్నారు

# కలం చేతిలో ఉంది.. కష్టాలు గుండెల్లో!

### జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం కళ్లు తెరవాలి
### అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు, ఇన్సూరెన్స్.. పరిష్కారం ఎప్పటికి?
### గాంధీజీ జయంతి సందర్భంగా శేరిలింగంపల్లిలో వర్కింగ్ జర్నలిస్టుల డిమాండ్స్ డే

**శేరిలింగంపల్లి : అక్టోబర్ 2, (ప్రభాత ఉదయం)**

సమాజంలో జరుగుతున్న అన్యాయాలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టుల జీవితాల్లోని సమస్యలను మాత్రం ఎవరు వెలుగులోకి తీసుకువస్తారు? ప్రజల హక్కుల కోసం ప్రశ్నించే కలం.. తన హక్కుల కోసం మాత్రం ప్రభుత్వ తలుపు తట్టాల్సిన పరిస్థితి ఎందుకు? విధి నిర్వహణలో ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు మరింత చొరవ చూపాల్సిన అవసరం ఉందనే డిమాండ్ బలంగా వినిపించింది. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'వర్కింగ్ జర్నలిస్టుల డిమాండ్స్ డే' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చందానగర్ పీజేఆర్ స్టేడియంలో రంగారెడ్డి జిల్లా జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా యూనిట్, శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీజేఆర్ స్టేడియంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి జర్నలిస్టు సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జర్నలిస్టుల సమస్యలపై మాట్లాడిన సంఘం నాయకులు ప్రభుత్వానికి పలు డిమాండ్లను వినిపించారు.

**జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి**

టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి,



డిమాండ్స్ డే సందర్భంగా జాతిపిత మహాత్మా గాంధీకి నివాళులర్పిస్తున్న జర్నలిస్టు సంఘ నాయకులు తో పాటు జర్నలిస్టులు..

రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎండీ సలీమ్ పాషా, జిల్లా కార్యదర్శి మేకల సత్యనారాయణ మాట్లాడుతూ విధి నిర్వహణలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు, బస్ పాసులు, హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్, ఇళ్ల స్థలాలు వంటి సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు, విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అన్నారు.

**రక్షణ చట్టం.. మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి**

జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని, నూతన మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు గతంలో ఉన్న హక్కులను పునరుద్ధరించడంతో పాటు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ రాష్ట్రపతికి లేఖ సమర్పించనున్నట్లు వివరించారు. జర్నలిస్టులపై దాడులు జరిగినప్పుడు వేగంగా స్పందించేలా దాడుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో




సభా వేదికపై మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సలీం పాషా తో పాటు ఇతర నాయకులు

ఉన్న జర్నలిస్టుల సంక్షేమ సమస్యలను ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

**ప్రజల గొంతుకకు.. ప్రభుత్వ అండ అవసరం**

ప్రజా సమస్యలను నిరంతరం ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లే జర్నలిస్టులు తమ సమస్యల పరిష్కారం కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడటం ఆందోళనకరమని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిజాన్ని ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా గుర్తిస్తున్న ప్రభుత్వాలు ఆ స్తంభాన్ని బలోపేతం చేసే దిశగా జర్నలిస్టుల సంక్షేమానికి స్పష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆనంతుల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు మాధవ్ రెడ్డి, ఏ. భీమన్న, భాస్కర్, పాండు యాదవ్, సంయుక్త కార్యదర్శులు సత్యనారాయణ, సూర్యనారాయణ, ఆంజనేయులు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు దర్పల్లి రవీందర్, నరసింహారావు, ఎండీ షకీల్ తోపాటు ఈసీ సభ్యులు, వివిధ నియోజకవర్గాల యూనియన్ నాయకులు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు, శేరిలింగంపల్లి, చేవెళ్ల, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, రాజేంద్రనగర్, ఎల్‌బీనగర్ తదితర ప్రాంతాలకు చెందిన జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 2 (ప్రభాత ఉదయం):**

స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, కరీంనగర్ లో స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వచ్ఛంద రక్తదానం యొక్క ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, ఆపదలో ఉన్న వారికి రక్తం అందించి ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా అందించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన రక్తదాతలకు, కార్యక్రమంలో పాల్గొని సహకరించిన సభ్యులకు లయన్స్ క్లబ్ కృతజ్ఞతలు తెలియజేసింది. సమాజ సేవలో భాగంగా ఇటువంటి మానవతా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని క్లబ్ ప్రతినిధులు తెలిపారు ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు చురుకుగా పాల్గొని తమ సహకారాన్ని అందించారు. చిదుర సురేష్, పెద్ది విద్యాసాగర్, కోల అన్నారెడ్డి, సైనేని నరేందర్, అలగండుల మునిందర్, ఐత సురజ్, బట్టు వినోద్, మెతుకు చైతన్య, ముక్క శరత్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## సంగారెడ్డి జిల్లాలో పోలీస్ అధికార పరిధి పునర్వ్యవస్థీకరణ

### కొత్తగా జిన్నారం సబ్-డివిజన్, గుమ్మడిదల సర్కిల్, ఇస్నాపూర్ పీఎస్ ఏర్పాటు

### గడ్డపోతారం పోలీస్ స్టేషన్ రద్దు.. పటాన్‌చెరు ట్రాఫిక్ పీఎస్ పేరు మార్పు

### ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర హోం శాఖ

**పటాన్ చెరు, అక్టోబర్ 2(ప్రభాత ఉదయం):**

సంగారెడ్డి జిల్లా పరిధిలో పోలీస్ అధికార పరిధిని పునర్వ్యవస్థీకరిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పరిపాలనా సౌలభ్యం, శాంతిభద్రతల సమర్థవంతమైన పర్యవేక్షణ, ప్రజలకు సత్వర పోలీస్ సేవలను అందించే లక్ష్యంతో పలు కొత్త విభాగాలు, సర్కిళ్లు, పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేస్తూ హోం శాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్ ఉత్తర్వులు (జీవో నెంబర్.88) జారీ చేశారు.

జీహెచ్ఎంసీ పునర్నిర్మాణం నేపథ్యంలో జోన్లు, డివిజన్ల పరిధి మారడంతో ఇప్పటికే ఉన్న పోలీస్ కమిషనరేట్లు, జిల్లాల అధికార పరిధి బాధ్యతలు భారీగా పెరిగాయి. ఈ క్రమంలో త్వరితగతిన స్పందించి, సమయాభావం తగ్గించడం, శాంతిభద్రతల పర్యవేక్షణను మరింత పటిష్టం చేసేందుకు సంగారెడ్డి జిల్లా పరిధిలో మార్పులు చేయాలని రాష్ట్ర డీజీపీ ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించిన ప్రభుత్వం తక్షణమే అమల్లోకి వచ్చేలా అధికారిక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. అందులో భాగంగా పలు కొత్త పోలీస్ స్టేషన్లు, డివిజన్, సర్కిల్ పరిధులలో మార్పులు చేర్పులు చేసారు.

కొత్తగా జిన్నారం సబ్-డివిజన్ ఏర్పాటు: పటాన్‌చెరు సబ్-డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలను వేరు చేస్తూ కొత్తగా జిన్నారం లా అండ్ ఆర్డర్ సబ్-డివిజన్ ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీని పరిధిలోకి ఇస్నాపూర్ పీఎస్, బీడీఎల్ భానూరు పీఎస్, జిన్నారం పీఎస్, గుమ్మడిదల సర్కిల్ (గుమ్మడిదల, హత్నూర పీఎస్‌లు), మరియు ఇస్నాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ రానున్నాయి.

నూతనంగా ఇస్నాపూర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు: పటాన్‌చెరు మండల పరిధిలోని చిట్కుల్, చిన్నకంజర్ల, ములగోలి, ఇంద్రేశం, ఇస్నాపూర్, ఐనోల్, లక్దారం, పెద్దకంజర్ల, రుద్రారం, రామేశ్వరం బండ, బచ్చుగూడెం తదితర 11 గ్రామాలను కలిపి కొత్తగా ఇస్నాపూర్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ పరిధిగా నోటిఫై చేశారు.

గుమ్మడిదల సర్కిల్ ఏర్పాటు: పరిపాలనా వికేంద్రీకరణలో భాగంగా కొత్తగా గుమ్మడిదల సర్కిల్ ను ఏర్పాటు చేశారు. దీని కిందకు గుమ్మడిదల, హత్నూర పోలీస్ స్టేషన్లు రానున్నాయి.

గడ్డపోతారం పీఎస్ రద్దు -- జిన్నారం పోలీస్ స్టేషన్ లో విలీనం: ఇప్పటివరకు ఉన్న గడ్డపోతారం పోలీస్ స్టేషన్‌ను రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతంలో గడ్డపోతారం పరిధిలో ఉన్న ఖాజీపల్లి, గూడెం, గొల్లగూడెం, గడ్డపోతారం, చెట్లపోతారం, అల్లీనగర్, కిష్టాయిపల్లి, దాచారం, మాధారం, దువ్వకుంట, మంత్రికుంట గ్రామాలన్నింటినీ ఇకపై జిన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలోకి రానున్నాయి.

పటాన్‌చెరు ట్రాఫిక్ పీఎస్ పేరు మార్పు: గతంలో సైబరాబాద్ కమిషనరేట్ నోటిఫికేషన్‌లో ఉన్న పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పేరును మార్చి, ఇకపై ఇస్నాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ గా నామకరణం చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మార్పులతో సంగారెడ్డి జిల్లాలోని పారిశ్రామిక ప్రాంతాలు, జాతీయ రహదారి పరిసర గ్రామాల ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువవుతాయని అధికార వర్గాలు తెలిపాయి.

## రాష్ట్రవ్యాప్తంగా సెంట్రల్ కిచెన్ల ఏర్పాటు

మొదటి పేజీ తరువాయి...

వంటశాల కోసం చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రతినిధి డి. సుమంత్, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ రూ. 4 కోట్ల విరాళం చెక్కును సీఎం చేతుల మీదుగా ఫౌండేషన్ ప్రతినిధి సత్య గౌర చంద్ర దాస్ స్వామీజీకి అందజేశారు. ఈ పథకం ద్వారా విద్యార్థుల శారీరక ఎదుగుదల, చదువులో ప్రగతిని నిరంతరం పరిశీలించడానికి డిజిటల్ హెల్త్ రికార్డులను నిర్వహిస్తారు. పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపాన్ని అరికట్టి పాఠశాలల్లో హాజరు శాతాన్ని గణనీయంగా పెంచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. పరిశుభ్రమైన వాతావరణంలో వేడివేడిగా సిద్ధమయ్యే అల్పాహారాన్ని ప్రత్యేక వాహనాల్లో నేరుగా బడులకు తరలిస్తారు. ఈ మహత్తర కార్యక్రమానికి స్వచ్ఛంద సంస్థలు కూడా పెద్దపీట వేస్తున్నాయి. హరేకృష్ణ మూవ్‌మెంట్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో వంటశాలల నిర్మాణం వేగంగా సాగుతోంది. ఇందులో భాగంగా నాగర్‌కర్నూల్ సెంట్రల్ కిచెన్ కోసం రూ. 5.17 కోట్లు, వికారాబాద్ యూనిట్ కోసం రూ. 4 కోట్లు విరాళంగా అందించేందుకు ఆ సంస్థ ముందుకొచ్చింది.




## వామన్‌పల్లిలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 02(ప్రభాత ఉదయం):**

ధరూర్ మండలం వామన్ పల్లిగ్రామంలో శుక్రవారం మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పర్ణిక కృపాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గాంధీజి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామ సభను నిర్వహించారు. ఉపాధి హామీ పథకం ద్వారా రైతుల పొలాల వద్ద కాంపౌండ్ గుంతలు, ఇళ్ల వద్ద ఇంకుడు గుంతల నిర్మించుకోవాలని గ్రామస్తులకు సూచించారు. అలాగే గ్రామంలో తాగునీరు, అండర్‌డ్రైనేజీ, వీధిలైట్లు తదితర సమస్యలను సభ దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సర్పంచ్ పర్ణిక రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను అలవర్చుకుని స్వచ్ఛ భారత్ సాధనలో భాగస్వాములు కావాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఉపసర్పంచ్ శిరీష రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.




## జూనియర్ బాలికల కబడ్డీ జిల్లా జట్టుకు 14 మంది ఎంపిక

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 02(ప్రభాత ఉదయం):**

జోగులాంబ గద్వాల జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గద్వాల ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జూనియర్ బాలికల కబడ్డీ జిల్లా స్థాయి సెలక్షన్స్‌కు విశేష స్పందన లభించింది. అసోసియేషన్ అధ్యక్షురాలు డికె. స్నిగ్ధ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపికల్లో జిల్లా నలుమూలల నుంచి సుమారు 70 మంది క్రీడాకారిణులు పాల్గొనగా, వారి ప్రతిభ ఆధారంగా 14 మందిని జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సెలక్షన్స్‌కు ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకటరాములు మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించేందుకు పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర సాధన ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారిణులు రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జోగులాంబ గద్వాల జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎంపికలకు హాజరైన క్రీడాకారిణులకు డికె. స్నిగ్ధ రెడ్డి ఆధ్వర్యంలో భోజనం మరియు ఇతర వసతులు కల్పించారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు అసోసియేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని నిర్వాహకులు తెలిపారు.

**అశ్వారావుపేటలో రాష్ట్రస్థాయి పోటీలు:**

ఎంపికైన 14 మంది క్రీడాకారిణులు అక్టోబర్ 10 నుండి 12వ తేదీ వరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల కబడ్డీ టోర్నమెంట్‌లో జోగులాంబ గద్వాల జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఇండోర్ స్టేడియం ఇన్‌చార్జ్ బషీర్, కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నర్సింహ, ట్రెజరర్ చందు, హేమవతి, పీడీలు కె. స్రవంతి, అరుణతార, రాధ, శివాని, దీప్తి, పీఈటీలు, ఈసీ మెంబర్ వెంకటన్న, సీఎం జిమ్ పాషా, సీనియర్ క్రీడాకారులు రాము, కేఆర్, మహేష్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 02(ప్రభాత ఉదయం):**



ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక ట్రాక్టర్ ను శుక్రవారం కేటిదొడ్డి పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.శ్రీనివాసులు తెలిపారు. రాయచూర్ జిల్లా గాజులపాడు నుంచి కేటిదొడ్డి మండల కేంద్రానికి ఇసుక తరలిస్తున్న క్రమంలో అనుమతులు లేకపోవడంతో ఇసుక ట్రాక్టర్ ను స్వాధీనం చేసుకుని, యజమాని జయన్న పై కేసు నమోదు చేశారు.



## జోగులాంబ గద్వాల జిల్లా ఉపాధ్యాయులకు ప్రతిష్టాత్మక రాష్ట్రస్థాయి పురస్కారాలు

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 02(ప్రభాత ఉదయం):**

మహాత్మా గాంధీ 157వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వేడుకల్లో జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు విశేష ప్రతిభ కనబరిచారు. విద్యా రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న జిల్లాకు చెందిన 9 మంది ఉపాధ్యాయ జంటలకు సంస్థ నిర్వాహకులు "గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ దంపతుల పురస్కారం" ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. భావి తరాలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలోనూ, విద్యా విలువల వ్యాప్తిలోనూ వీరు కనబరుస్తున్న అంకితభావాన్ని ఈ సందర్భంగా నిర్వాహకులు కొనియాడారు.

పురస్కార గ్రహీతల వివరాలు:

వరిమళ్ళ నల్లా రెడ్డి -- దంపతులు జి. వెంకటేష్ -- దంపతులు టి. యువతి -- దంపతులు మహేందర్ అనిమోని -- దంపతులు బి. కె. వెంకటేష్ -- దంపతులు నూర్జహాన్ -- దంపతులు పి. మురళీధర్ రెడ్డి -- దంపతులు వి. నాగరాజు -- దంపతులు బి. శివ కుమార్ -- దంపతులు

రాష్ట్రస్థాయిలో ఈ అవార్డులను కైవసం చేసుకుని జోగులాంబ గద్వాల జిల్లా ఖ్యాతిని చాటిన ఉపాధ్యాయులను పలువురు ప్రముఖులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ గున్న రాజేందర్ రెడ్డి, చీూఖీ జిల్లా అధ్యక్షులు పాల్వాయి లక్ష్మీనారాయణ, చీూఖీ ప్రధాన కార్యదర్శి కొండాపురం ప్రతాప్, సంస్థ జిల్లా అధ్యక్షులు రాజు సాగర్, మోటివేషనల్ స్పీకర్ ఈశ్వర్, డ్రా నరసింహులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు



## దోపిడీకి నిలయంగా మారిన స్వామి సన్నిధి

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 2 (ప్రభాత ఉదయం):**

దేవాలయాల వద్ద టెండర్ నిర్వహించి దుకాణాలు ఏర్పాటు చేస్తుండగా జిల్లాలో అధిక ధరలకు అమ్ముతూ భక్తులను దోచుకుంటున్నారు. బయట మార్కెట్లో వ్యాపారులు కొబ్బరికాయ 20 రూపాయలు అమ్మితే దేవాలయాల వద్ద ఉన్న కేంద్రాల్లో 25 నుంచి 30 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. ఇలా ఏ వస్తువు తీసుకున్న బయట మార్కెట్ కంటే ఐదు నుంచి పది శాతం అధిక ధరలు ఇక్కడ ఇస్తున్నాయి. శ్రావణం, కార్తీక, మాసంలో భక్తుల రద్దీ ఉన్నప్పుడు ఇంకా ఎక్కువ ధరలో విక్రయిస్తున్నారని విమర్శలు ఉన్నాయి, ఆలయ అధికారులు సైతం టెండర్ దారులపై పర్యవేక్షణ లేకుండా పోతుంది.

లోపాయికారీ ఒప్పందం... ఆలయాల్లో నిత్య పూజలు పూజ సామాగ్రి దేవాదాయ శాఖ ని భరించాలి. టెండర్ దారులు నుండి ముక్కు పిండి పూజా సామాగ్రి నీ దీప దూప నైవేద్యం కోసం వినియోగించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో టెండర్ దారులు విచ్చలవిడి ధరలతో పూజా సామాగ్రి భక్తులకు విక్రయిస్తున్నారని సమాచారం.

వివాదాస్పదం.. నగరంలో పాత శివాలయం వద్ద పోటాపోటీగా పూజ సామాగ్రి విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయగా ట్రాఫిక్ సమస్యలు ఎదురుఅవుతున్నాయి రోడ్లపైన అధికారిక టెండర్ దుకాణాలు పెట్టారని ఫిర్యాదు చేయగా అధికారులు విచారణ చేశారు. టెండర్ దారు గడువు వచ్చే జూలై వరకు ఉండడంతో సమస్య కొంత జటిలమైంది.

లిగత ఏడాది అయ్యప్ప దేవాలయంలో టెండర్ దాటి పోటీగా ఒక దుకాణం ఉండవద్దని షరతులతో వేలం పాడారు. తీరా టెండర్ దారి ఎదురుగా ఒక ప్రైవేటు వ్యక్తి పూజా కేంద్ర ఏర్పాటు చేయడం వివాదాస్పందనంగా మారింది. దీంతో మొత్తం డబ్బులు చెల్లించలేనని టెండర్ దారు చేతులెత్తేశారు. ఇటీవల కొత్తగా టెండర్ నిర్వహించి ఇచ్చారు. భక్తి భవనతో దేవాలయం కు వెళ్తే అధిక ధరలతో భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నాఆరోపణలు ఉన్నాయి.




## జిల్లా జైలుకు చెస్ట్ ఫ్రీజర్‌ను విరాళంగా అందించిన లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 2 (ప్రభాత ఉదయం):**

లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా కరీంనగర్ జిల్లా జైలుకు 500 లీటర్ల చెస్ట్ ఫ్రీజర్‌ను విరాళంగా అందజేశారు. జైలు పరిధిలో ఆహార పదార్థాలను సురక్షితంగా, పరిశుభ్రంగా నిల్వ చేసేందుకు, అలాగే ఖైదీల సంక్షేమానికి ఉపయోగపడే విధంగా ఈ చెస్ట్ ఫ్రీజర్‌ను అందించారు. శుక్రవారం ఉదయం 10:00 గంటలకు కరీంనగర్ జిల్లా జైలు ప్రాంగణంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, కమిషనర్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి ఎమ్ హెచ్ ఓ హాజరై లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ చేపట్టిన ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించారు. క్లబ్ అధ్యక్షుడు మయాదం శివకాంత్ పటేల్ మాట్లాడుతూ, సమాజంలోని అవసరాలను గుర్తించి ప్రజలకు, వివిధ ప్రభుత్వ సంస్థలకు ఉపయోగపడే విధంగా మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.. ఈ సేవా కార్యక్రమం ద్వారా సేవ, మానవతా దృక్పథం మరియు సమాజ సంక్షేమం పట్ల లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్‌కు ఉన్న నిబద్ధత మరోసారి చాటిచెప్పబడింది. ఈ కార్యక్రమంలో చిదుర సురేష్, పెద్ది విద్యాసాగర్, మేతుకు చైతన్య, బట్టు వినోద్, సింగమరాజు, రేగూరి రవీందర్, నాగమల్ల వేణు మాధవ్, మేతుకు వంశీకృష్ణ, అలగండుల మునీందర్, ఐతా సూరజ్, కాదర్ల ప్రభాకర్, గారెపల్లి వేణుకుమార్ తదితర లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు తమ సహకారాన్ని అందించారు.

## ప్రభుత్వం సన్న బియ్యం ధరలను నియంత్రించాలి

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 2 (ప్రభాత ఉదయం):**



సన్నబియ్యం ధరలు మార్కెట్లో దడ పుట్టిస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో వానాకాలం సీజన్‌లో సన్నరకం ధాన్యం సాగు తగ్గడం, భవిష్యత్తులో ధాన్యం కొరత ఏర్పడనుందనే అంచనాలతో వ్యాపారులు ముందుగానే సన్న ధాన్యం నిల్వ చేసి పెడుతుండడంతో మార్కెట్లో ధరలు రోజురోజూకు పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఆర్ఎన్ఆర్‌వంటి సన్నరకం బియ్యం హోల్‌సెల్‌ధర కిలోకు 74 నుంచి 85 రూపాయల వరకు పలుకుతోంది. ప్రస్తుతం ధాన్యం నిల్వలపై ని యంత్రణ లోపం, మిల్లర్ల సమస్యల కార ణంతో పెరుగుతున్న బియ్యం ధర కొద్ది రోజుల్లోనే పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఈసారి వానా కాలంలో ప్రభుత్వం సన్నరకాలే సాగు చేయాలని, అది కూడా ఏడు రకాలకే రాయితీ ఇస్తామని చెప్పినా రైతులు మాత్రం సన్న ధాన్యం సాగుకు అంతంత మాత్రం గానే ముందుకు వచ్చారు. కొద్దిగా సాగైన స న్నాలకు సైతం ఈ సారి కొత్త రకం చీడ పీడలు ఆశించి పంట దెబ్బతింటోంది. మరో 20 శాతం పొ లాలు నీటి ఎద్దడి, విద్యుత్తు కోతల కారణంగా దె బ్బతింటున్నాయి. ఈ కారణాలన్నీ పంట దిగు బడిపై ప్రభావం చూపుతున్నాయి. రాష్ట్రప్రభుత్వం పేదలకు రేషన్‌దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ ప్రా రంభించాక బహిరంగ మార్కెట్లో సన్నబియ్యం ధరలు తగ్గుముఖం పట్టాయి. నూకలు ఎక్కువగా వస్తుండడంతో దిగువ, మధ్య తరగతి ప్రజలు రేషన్‌బియ్యం తినడం తగ్గించారు. ఈ బి య్యాన్ని దళారులకు విక్రయించి దుకాణాల్లో ఫైన్‌క్వాలీటీ బియ్యం కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలకు డిమాండ్‌పెరగడంతో రేషన్‌కార్డు దారుల నుంచే వ్యాపారులు 22 నుంచి 25 రూపాయల ధరకు సేకరిస్తున్నారు. వాటిని దళారులకు 30 రూపాయ లకు విక్రయిస్తున్నారు. వారు బియ్యాన్ని పాలిష్‌పట్టి, తిరిగి బహిరంగ మార్కెట్లో ఏదో ఒక బ్రాండ్‌పేరుతో కిలో 50 రూపాయలకు విక్రయిస్తున్నారు. మార్కెట్లో ఫైన్‌క్వాలిటీ రైస్‌ధరలు పెరగడంతో రేషన్‌బియ్యానికి డిమాండ్‌వచ్చింది.

బియ్యం ధరలను అదుపు చేయాలి.. కాసబోయిన కిరణ్, కాట్రపల్లి

బియ్యం ధరలను చూస్తుంటే భయం వేస్తోంది. రోజు రోజుకి బియ్యం ధరలు పెరుగుతూ పోతే సామన్య ప్రజలకు ఆర్థిక భారం పెరుగుతుంది. ఇంటి బడ్జెట్‌ను రూపొం దించుకొని మధ్య తరగతి ప్రజలు పెరుగుతున్న బియ్యం ధరలతో అవస్థలు పడుతున్నారు.

రేషన్‌బియ్యంలో నూక ఎక్కువగా వస్తోంది... బోయిని సమ్మక్క, కనుకులగిద్దె

రేషన్‌బియ్యంలో నూక ఎక్కువగా వస్తోంది. రేషన్‌బియ్యాన్నే వండుకుం టున్నా. బియ్యంలో నూక రాకుండా ప్రభుత్వం జర దృష్టి పెట్టాలి. బయట బియ్యం ధరలు భగ్గుమంటున్నాయి.

ధరల నియంత్రణపై దృష్టి పెట్టాలి... బింగి కరుణాకర్, రంగాపూర్. రాష్ట్ర ప్రభుత్వం సన్న రకాల సాగుపై నిబంధనలు పెట్టడంతో సన్న బియ్యం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. వ్యాపా రులు బియ్యం ధరలను పెంచే స్తున్నారు. ప్రభుత్వం సన్న బియ్యం ధరలను నియంత్రించాలి.

# గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించి రంగారెడ్డి జిల్లా జర్నలిస్టుల వినతి పత్రం

### రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎండీ సలీమ్ పాషా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి


ఐ జే యూ - నేషనల్ డిమాండ్స్ డే లో పాల్గొన్న రాజేంద్రనగర్ నియోజకవర్గం జర్నలిస్టులు


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సలీం పాషా


మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఐజేయూ పిలుపుమేరకు వర్కింగ్ జర్నలిస్టుల డిమాండ్స్ డే సందర్భంగా చందానగర్ లో పోటెత్తిన కలం వీరులు

**రాజేంద్రనగర్, అక్టోబరు 2 (ప్రభాత ఉదయం) :**

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న వర్కింగ్ జర్నలిస్ట్ ల డిమాండ్స్ డే సందర్భంగా రంగారెడ్డి జిల్లాలోని శేరిలింగంపల్లి నియోజకవర్గం పీజేఆర్ స్టేడియంలో శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా యూనిట్- శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొండ విజయకుమార్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఐజేయూ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సలీమ్ పాషా, జిల్లా కార్యదర్శి మేకల సత్యనారాయణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.అంతకుముందు జర్నలిస్టుల సమస్యలపై నేతలు మాట్లాడారు, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఎండీ సలీమ్ పాషా, కార్యదర్శి మేకల సత్యనారాయణ లు మాట్లాడుతూ జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ, అక్రిడిటేషన్ కార్డులు,బస్ పాసులు, హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించి రక్షణ కల్పించాలని నాయకులు కోరారు.పనిచేసే జర్నలిస్ట్ లకు సంబందించిన సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి,పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి జర్నలిస్టులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో ఈ కార్యక్రమంలో మాజీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఆనంతుల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు మాధవ్ రెడ్డి, అప్పారెడ్డి గూడెం భీమయ్య, భాస్కర్, పాండు యాదవ్, సంయుక్త కార్యదర్శులు సత్యనారాయణ, పగిడిమర్రి సూర్య నారాయణ, ఆంజనేయులు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు దర్పల్లి రవీందర్, నరసింహ రావు, ఎండీ షకీల్,ఈసీ సభ్యులు దర్శనం జంగయ్య, ఇలియాజ్, ప్రణయ్ ముదిరాజ్, శేఖర్, కరుణాకర్, కృష్ణ,చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షులు యాదయ్య, రాజేంద్రనగర్ నియోజకవర్గం అధ్యక్షుడు మేకల దామోదర్ రెడ్డి, షాద్ నగర్ నియోజకవర్గ ఎలాక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు నర్సింహా,శేరిలింగంపల్లి నియోజకవర్గ యూనియన్ నేతలు నాగేష్, నరేష్, గోవర్ధన్ రెడ్డి, మల్లేష్, శంకర్, నాగారత్నం,ప్రభాకర్ మహేందర్,భూమేష్,జనం సాక్షి శ్రీనివాస్, మహేందర్,యాసీన్,ఫారుఖ్, ఖాజా, బస్వారాజ్, షారఫొద్దీన్,సతీష్, సల్వేదర్ టిల్లు,ఎలాక్ట్రానిక్ మీడియా కార్యదర్శి విజయ్,ప్రవీణ్, షఫీ,జిల్లాలోని వివిధ ప్రెస్ క్లబ్ ల అధ్యక్షులు మహిపాల్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రవీందర్, మల్లికార్జున్, జగన్, రాము యాదవ్, జిలానీ, జయంత్, మనోహర్,రమేష్,భాస్కర్, విష్ణు, మల్లికార్జున్,షాద్ నగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, చేవెళ్ల, రాజేంద్ర నగర్, ఎల్ బీ నగర్, మహేశ్వరం నియోజకవర్గాలకు చెందిన జర్నలిస్టులు ఎం ప్రేమ్ రాజ్, గద్దె యాదగిరి, కోరని మహేష్, వినయ్ కుమార్, నరసింహ, లతో పాటు పెద్ద సంఖ్యలో జర్నలిస్ట లు పాల్గొన్నారు.


భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రీ జయంతి సందర్భంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియం లో ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు సామ ఇంద్రపాల్ రెడ్డి, టి ప్రేమ్ గౌడ్, ఎన్ ధనుంజయ, ఎం ప్రభాకర్ రెడ్డి , గోల్కొండ రాజ్ కుమార్ తదితరులు





## ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వాన్ని ప్రజలు మరోసారి కోరుతున్నారు

### బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి అన్నపురెడ్డి స్వర్ణలత రెడ్డి

### ప్రధాని నరేంద్ర మోడీ పాలనపై దేశ ప్రజల మొగ్గు: వై శ్రీధర్

**రాజేంద్రనగర్, అక్టోబర్ 2(ప్రభాత ఉదయం)**

గత 25 ఏళ్లుగా ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా దేశ సమగ్రత కోసం, ప్రజల సంక్షేమం కోసం ముందుకు వెళ్తున్నారని బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి అన్నప్పరెడ్డి స్వర్ణలతా రెడ్డి, బిజెపి గోల్కొండ ఇన్చార్జ్ వై శ్రీధర్ అన్నారు. శుక్రవారంబిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యంలో అంగన్ మిలన్ సేవా కార్యక్రమం లో భాగంగా అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని సులేమాన్ నగర్ డివిజన్లో అంగన్వాడి సెంటర్ లో బిజెపి మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకలవనితారెడ్డి ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లకు ఆశ వర్కర్లకు ఆయమ్మల ఘనంగా సన్మానం చేశారు.ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం పురస్కరించుకొని సందర్భంగా ఆయన 25 సంవత్సరాల సుదీర్ఘ పాలనకు గుర్తుగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు బిస్కెట్లు చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బి జె పి డివిజన్ అధ్యక్షులు యు లక్ష్మి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కిరణ్ చారి,విక్రమ్ చారి , తదితరులు పాల్గొన్నారు.


ఎర్ర బోడ అంగన్వాడీ కేంద్రం లో జరిగిన అగ్ని ప్రమాదాన్ని పరిశీలిస్తున్న ఐ సీ డీ ఎస్ అధికారులు

## ఎర్రబోడ అంగాన్వాడీ కేంద్రంలో అగ్ని ప్రమాదం

**బుద్వేల్, అక్టోబరు 2 (ప్రభాత ఉదయం)**

ఎర్రబోడ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అగ్ని ప్రమాదం జరిగిన విషయాన్ని అంగన్వాడీ ఉపాధ్యాయురాలు అధికారులకు సమాచారం ఇచ్చారు. జిల్లా కలెక్టర్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ఆదేశాల మేరకు శేరిలింగంపల్లి సీడీపీఓ కవిత, సూపర్వైజర్ శారద ఎర్రబోడ అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పరిస్తితిని పరిశీలించారు. అనంతరం స్థానికులతో మాట్లాడి అగ్ని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అగ్ని ప్రమాదంలో బరువు ను తూచే పరికరాలు, ఆట వస్తువులు, పాత రిజిస్టర్లు, 90 గుడ్లు, 50 కిలోల బియ్యం తెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. ఘటన పై అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి నూతన బస్తీలు, కాలనీలు

**రాజేంద్రనగర్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి):**

జీహెచ్ ఎంసీ పునర్వవస్థీకరణ నేపథ్యంలో నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వచ్చే పలు ప్రాంతాలను రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి మారుస్తు హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు రాజేంద్రనగర్ ఇన్స్ పెక్టర్ వెంకటేశ్ ఓ ప్రకటన లో తెలిపారు. హైదర్షి కోట్ వార్డు పరిధిలోని హైదరాకోట్, గందంగూడ, బైరాగిగూడ, పీరం చెరువు ప్రాంతాలతో పాటు తెలంగాణ పోలీస్ అకాడమీ పరిసర ప్రాంతం, ఆర్మీ ఫైరింగ్ రేంజ్ పరిసర ప్రాంతం రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తాయన్నారు. ప్రజలు ఈ మార్పు ను గమనించాలని కోరారు.

# మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిలకు నివాళులర్పించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## వివిధ ప్రాంతాల్లో ఘనంగా మహాత్మా గాంధీ జయంతి వేడుకలు


మైలార్ దేవుపల్లి లోని ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ నివాసంలో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీ చిత్ర పటాలకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, తదితరులు




ప్రభాత్ భేరీ కార్యక్రమంలో పాల్గొన్న రాజేంద్రనగర్ నవ జ్యోతి యూత్ క్లబ్ సభ్యులు


బాబుల్ రెడ్డి నగర్ లో మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు సోమ శ్రీనివాస్ గుప్తా, తదితరులు


రాజేంద్రనగర్ లో మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


ఆప్కోకాలని లో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను నిర్వహించిన కాలనీ వాసులు నరేష్ యాదవ్. పాల్గొన్న గుమ్మడి కుమార్, అక్కెం రాఘవేందర్ యాదవ్


హైదర్ గూడ లో మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న వివిధ పార్టీల నాయకులు

**బుద్వేల్, అక్టోబరు 2 (ప్రభాత ఉదయం) :**

జాతిపిత మహాత్మా గాంధీ, దేశ మాజీ ప్రధాన మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి ల జయంతి సందర్భంగా రాజేంద్రనగర్ శాసనసభ్యులు టి ప్రకాష్ గౌడ్ వారికి ఘనంగా నివాళులు అర్పించారు.శుక్రవారం ఉదయం మైలార్‌దేవపల్లిలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్యం, అహింస అనే ఆయుధాలతో దేశానికి స్వాతంత్ర్యం సాధించిపెట్టిన మహాత్ముని సేవలను, అలాగే 'జై జవాన్ – జై కిసాన్' నినాదంతో దేశాన్ని, రైతులను, జవాన్లను ముందుకు నడిపించిన శాస్త్రి గారి ఆదర్శాలను మనం ఎప్పటికీ మరువకూడదని అన్నారు. వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం లోని వివిధ ప్రాంతాల్లో జరిగిన మహాత్మా గాంధీ జయంతి వేడుకల్లో రాజకీయ పార్టీల నాయకులు కొలను సుభాష్ రెడ్డి, ఎం రామేశ్వరరావు, ఎన్ మల్లారెడ్డి , ఎం కొమురయ్య, చెట్టిగారి నరేందర్ రావు, సామ ఇంద్రపాల్ రెడ్డి, ఎన్ ధనుంజయ, గుమ్మడి కుమార్, అక్కెం రాఘవేందర్ యాదవ్, పడమటి శ్రీధర్ రెడ్డి, ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


సేవా సేతు అభియాన్ ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన అవగాహన కార్యక్రమం లో పాల్గొన్న అధికారులు

## సూర్యఘర్ పథకంకు విశేష స్పందన

**రాజేంద్రనగర్, అక్టోబరు 2 (ప్రభాత ఉదయం) :**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూర్యఘర్ పథకం పై శుక్రవారం శివరాంపల్లి లోని రాజేంద్రనగర్ విద్యుత్ డీఈ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన అవగాహన సమావేశానికి విద్యుత్ వినియోగదారుల నుంచి విశేష స్పందన లభించింది. విద్యుత్ శాఖ, సోలార్ వెండర్లు, బ్యాంకర్లు పాల్గొన్న ఈ కార్యక్రమం లో 33 మంది వినియోగదారులు హాజరైనారు. ఈ పథకం కోసం నలుగురు దరఖాస్తు చేసుకున్నట్లు రాజేంద్రనగర్ సర్కిల్ విద్యుత్ ఎస్ఈ ఎస్ రవి ప్రసాద్ తెలిపారు. సోలార్ విద్యుత్ను ఏర్పాటు చేసుకున్నట్లయితే విద్యుత్ బిల్లు లో ఆదా చేసుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ ఇంచార్జి బి చంద్రశేఖర్, ఏడీఈ లు ఈశ్వర్ ప్రసాద్, సత్యనారాయణ, సుధాకర్ బాబు, ఏఈ దుర్గా ప్రసాద్, రమేశ్ లు పాల్గొన్నారు.


తలసేమియా సికిల్ సెల్ సొసైటీ లో పనిచేస్తున్న సిబ్బందిని అభినందించిన ఎంపీ డాక్టర్ కె లక్ష్మణ్

## తలసేమియా సికిల్ సెల్ రోగులను ఆదుకోవడంలో టీఎస్ సీఎస్ కృషి అభినందనీయం: ఎంపీ డాక్టర్ కె లక్ష్మణ్

**బుద్వేల్, అక్టోబరు 2 (ప్రభాత ఉదయం)**

జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా రాజేంద్రనగర్ రాఘవేంద్ర కాలనీ లోని తలసేమియ సికిల్ సెల్ సొసైటీ (టీఎస్ సీఎస్) నాలుగు వేల స్వచ్ఛంద రక్తదాన శిభిరాలను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా వేడుకలు నిర్వహించారు. టీఎస్సీఎస్ ప్రతినిధి బృందాన్ని, అందులో పనిచేస్తున్న డాక్టర్లు, సిబ్బందిన సన్మానించి అవార్డులను అం దజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ కె లక్ష్మణ్ పాల్గొన్నారు. స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహించడం తో పాటు, తలసేమియా సికిల్ సెల్ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు అండగా నిలవడం లో ఈ సంస్థ చేస్తున్న కృషిని ఎంపీ డాక్టర్ కె లక్ష్మణ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ సీఎస్ అధ్యక్షులు డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్, చీఫ్ మెడికల్ ఆఫీసర్, కార్యదర్శి డాక్టర్ సుమన్ జైన్, సంయుక్త కార్యదర్శి అలీంబేగ్, వైస్ ప్రెసిడెంట్ రత్నావళిలు పాల్గొన్నారు.



పార్లమెంటు మాజీ సభ్యులు వి తులసి రామ్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## రాజేంద్రనగర్‌లో పార్లమెంటు మాజీ సభ్యులు వి తులసీంరాం జయంతి

**బుద్వేల్, అక్టోబరు 2 (ప్రభాత ఉదయం):**

పార్లమెంటు మాజీ సభ్యులు, దళిత నేత, గాంధేయ వాది వి తులసీరాం జయంతి సందర్భంగా రాజేంద్రనగర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి దళిత సంఘాల ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. వి తులసీరాం సేవలను గుర్తు చేసుకున్నారు. గాంధేయ వాదిగా వినోబా బావే అడుగు జాడల్లో నడుచుకుంటు సర్వోదయ ట్రస్టు లో సేవలందిస్తు కాటేదాన్ సర్పంచ్గా పనిచేసిన వి తులసీరాం మూడు పర్యాయాలు ఎంపీగా దేశానికి సేవలందించారన్నారు. ఆయన ఇందిరాగాంధీ, బాబు జగ్జీవన్ రాం, పీవీ నర్సింహ్మారావు, వీపీ సింగ్ లాంటి పెద్ద పెద్ద నాయకులతో కలసి పనిచేశారన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల ప్రతినిధులు పంబాల రాజు, పచ్చ నర్సింగ్ రావు, సత్యార నర్సింహ్మ, గొడుగు సంజీవ, నాయకులు పడమటి శ్రీధర్ రెడ్డి, సామ ఇంద్రపాల్ రెడ్డి, కోరని బాలరాజ్, ఎం ఎ నయీమ్, ఎం శ్రీనివాస్, రాపోలు సత్తయ్య, ఎం శ్రీకాంత్, ఎం ప్రభాకర్ రెడ్డి, గోల్కొండ రాజు, ఎం యాదమ్మ యాదవ్, పి ఉమా మహేశ్వరి, దుంబాల ఝాన్సీ రెడ్డి, గంటి శోభ, ఎస్ లక్ష్మీ నర్సు, పచ్చ అనిత, తదితరులు పాల్గొన్నారు.


విజయ ఆయిల్ ప్యాకింగ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ లు

## శివరాంపల్లి వద్ద విజయ ఆయిల్ ప్యాకింగ్ కేంద్రం

**బుద్వేల్, అక్టోబరు 2 (ప్రభాత ఉదయం)**

రూ.25 కోట్ల అంచనా వ్యయంతో శివరాంపల్లి విజయ ఆయి ల్ కంపెనీ వద్ద నిర్మించిన నూతన మెగా ఆయిల్ ప్యాకింగ్ కేంద్రాన్ని శుక్రవారం మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ లు ప్రారంభించారు. అనం తరం విజయ పర్ట్ మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభించారు. రూ.2 కోట్ల వ్యయం తో నిర్మించనున్న విజయ డెయిరీ నూతన విక్రయ కేంద్రం భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ అధికారులు,ఉద్యోగులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# అహింసే శ్రీరామరక్ష.. దేశభక్తే జాతి నిర్మాణానికి శక్తి

### గాంధీజీ, శాస్త్రిజీ ఆశయాలను యువత ఆచరించాలి

### మాదాపూర్‌లో ఘనంగా ప్రపంచ అహింసా దినోత్సవం, శాస్త్రిజీ జయంతి వేడుకలు

**శేరిలింగంపల్లి : అక్టోబర్ 2, (ప్రభాత ఉదయం)**

సత్యం, అహింసతో స్వాతంత్ర్య పోరాటానికి దిశానిర్దేశం చేసిన మహాత్మాగాంధీ, నీతి నిజాయితీ నిబద్ధతకు ప్రతీకగా నిలిచిన మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ పిలుపునిచ్చారు. దేశ సమైక్యత, సమగ్రతతో పాటు సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ప్రపంచ అహింసా దినోత్సవం, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని మాదాపూర్ స్వాతి హైస్కూల్ ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహానికి, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటానికి ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ



జాతిపిత మహాత్మా గాంధీకి నివాళులర్పిస్తున్న నిర్వాహకులు..

సందర్భంగా రామస్వామి యాదవ్ మాట్లాడుతూ సత్యం, అహింస, సత్యాగ్రహం, సహాయ నిరాకరణ వంటి సిద్ధాంతాలతో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా మహాత్మాగాంధీ సాగించిన పోరాటం ప్రపంచ చరిత్రలోనే ప్రత్యేకమైనదన్నారు. అంటరానితనం నిర్మూలన, పరిసరాల పరిశుభ్రత, గ్రామ స్వరాజ్యం, మహిళా సాధికారత, సామాజిక సమానత్వం కోసం గాంధీజీ నిరంతరం కృషి చేశారని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా హింస, ఉగ్రవాదం పెరిగి ప్రాణ, ఆస్తి నష్టాలతో పాటు అభివృద్ధికి ఆటంకం కలుగుతున్న నేపథ్యంలో గాంధీజీ చూపిన అహింసా మార్గం నేటికీ ఎంతో ప్రాసంగికమన్నారు. ప్రపంచ శాంతి కోసం ఐక్యరాజ్యసమితి అక్టోబర్ 2ను ప్రపంచ అహింసా దినోత్సవంగా పాటించడం భారతీయులందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అయిన భారతదేశంలో జాతీయ సమైక్యత, సమగ్రతను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. లాల్‌బహదూర్ శాస్త్రి దేశానికి రెండవ ప్రధానిగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా, కేంద్ర రైల్వే, హోంశాఖ మంత్రిగా విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. 1965 భారత్ పాక్ యుద్ధ సమయంలో దేశ ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చి స్ఫూర్తినిచ్చారని, "జై జవాన్ జై కిసాన్" నినాదంతో సైనికులు, రైతుల సేవలను దేశానికి గుర్తుచేశారని తెలిపారు. నేటి యువత గాంధీజీ, శాస్త్రిజీల జీవితాలను ఆదర్శంగా తీసుకుని అవినీతి, స్వార్థపూరిత ఆలోచనలకు దూరంగా ఉండాలని, సమాజంలోని దురాచారాలకు వ్యతిరేకంగా నిలిచి దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని రామస్వామి యాదవ్ కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రిక, అధ్యాపకులు, విద్యార్థులతో పాటు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కొత్తపల్లి కోటేశ్వరరావు, శివరామకృష్ణ, జి.వి.రావు, సత్యనారాయణ, నందూరి వెంకటేశ్వర రాజు తదితరులు పాల్గొన్నారు.




శాస్త్రి, గాంధీజీ చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న కమాండెంట్ శివ ప్రసాద్ రెడ్డి ఇతర అధికారులు..

## సత్యం అహింస నిజాయితీ పోలీసు శాఖకు ఆదర్శం

### 8వ బెటాలియన్ కమాండెంట్ డి. శివప్రసాద్ రెడ్డి

**శేరిలింగంపల్లి : అక్టోబర్ 2, (ప్రభాత ఉదయం)**

శాంతి, అహింసల మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిపెట్టిన జాతిపిత మహాత్మా గాంధీ, నిరాడంబరతకు, నిజాయితీకి ప్రతీకగా నిలిచిన మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిల జీవితాలు పోలీసు వ్యవస్థకు మార్గదర్శకాలని 8వ బెటాలియన్ కమాండెంట్ డి. శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. కొండాపూర్‌లోని 8వ బెటాలియన్ లో గాంధీజీ, శాస్త్రిల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరువురు మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కమాండెంట్ శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో గాంధీజీ చూపిన అహింసా సిద్ధాంతాలు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్క పోలీసు అధికారి, సిబ్బంది సంయమనం పాటిస్తూ ప్రజల పట్ల కరుణ, సేవాభావంతో వ్యవహరించడమే గాంధీజీకి ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. 1965 యుద్ధ సమయంలో దేశాన్ని ధీరత్వంతో ముందుండి నడిపించిన లాల్ బహదూర్ శాస్త్రి సేవలను స్మరించుకున్నారు. "జై జవాన్ జై కిసాన్" నినాదంతో రైతుల్లో, సైనికుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపిన శాస్త్రి నిజాయితీ, క్రమశిక్షణను అధికారులు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం అసిస్టెంట్ కమాండెంట్లు డి. సత్యనారాయణ, డి. నరేందర్ రెడ్డిలతో పాటు రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, బెటాలియన్ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## హఫీజ్‌పేట్‌లో వీధి కుక్కల స్వైర విహారం

### వైద్య ఆరోగ్య శాఖ అవగాహన

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 2(ప్రభాత ఉదయం)**

హఫీజ్‌పేట్ ప్రాంతంలో వీధి కుక్కల స్వైర విహారం ఎక్కువైంది. గత కొద్ది రోజులుగా చిన్న పిల్లలు, పెద్దవాళ్లను కుక్కలు కరుస్తున్న ఘటనలు పెరుగుతున్నాయి. దీనివల్ల స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. స్వర్ణకుమారి ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ బృందం హఫీజ్‌పేట్ లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డా. రాకేష్, హెల్త్ సూపర్‌వైజర్లు, లోకల్ మెడికల్ ఆఫీసర్, ఆశా మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. జిహెచ్ఎంస ఆధ్వర్యంలో వెంటనే అనిమల్ బర్త్ కంట్రోల్ కార్యక్రమం చేపట్టాలని, కుక్కలకు ఆంటీ రాబిస్ వ్యాక్సిన్ వేయాలని కోరారు. కుక్క కరిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏంటి రాబిస్ వ్యాక్సిన్ ఉచితంగా వేయించుకోవాలని సూచించారు.



## నేడు గగన్ పహాడ్ విద్యుత్ సెక్షన్‌లో సరఫరాలో అంతరాయం

**రాజేంద్రనగర్, అక్టోబర్ 2 (ప్రభాత ఉదయం)**

గగన్‌పహాడ్ సెక్షన్‌లో వివిధ మరమ్మత్తుల నిమిత్తం ఫీడర్‌పై విద్యుత్ సరఫరా శనివారం నిలిపివేయబడుతుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ హర్షవర్ధన్ తెలిపారు. సెక్షన్ పరిధిలో ఉదయం 10:00 గంటల నుండి 10:30 గంటల వరకు శాతం రాయి గ్రామ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన శాతం రాయి గ్రామం, బలహీన వర్గాల కాలనీ, పసంబండ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.



## గాంధీజీ ఆశయాలను ఆచరించడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి

### సత్యం, అహింస మార్గంలో సమాజం ముందుకు సాగాలి

### కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్

**కూకట్ పల్లి, అక్టోబర్ 2 (ప్రభాత ఉదయం)**

మహాత్మా గాంధీ ఆశయాలను ఆచరించడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన ఘన నివాళి అని టిపిసిసి ఉపాధ్యక్షులు, కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గ పరిధిలో గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్, భరత్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షులు డా. పి నాగిరెడ్డి, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వివిధ కార్యక్రమాల ద్వారా నిర్వహించిన మహాత్మా గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి, సేవా మార్గాలను స్మరించుకున్నారు. మహాత్మా గాంధీ దేశానికి స్వాతంత్ర్యం సాధించడమే కాకుండా, సత్యం, అహింస, సామాజిక సమానత్వం, పరిశుభ్రత వంటి విలువలను సమాజానికి అందించారని అన్నారు. గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కాలనీ లోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళిని అర్పించారు.



## ఐజేయు ఆధ్వర్యంలో గాంధీజి విగ్రహం వద్ద నిరసన చేపట్టిన జర్నలిస్టులు

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 02(ప్రభాత ఉదయం):**

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టి యు డబ్ల్యూ జే-ఐజేయు రాష్ట్ర కమిటి పిలుపు మేరకు శుక్రవారం గద్వాల పట్టణంలోని గాంధీ చౌక్‌లో గాంధీజీ విగ్రహం వద్ద ఐజేయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బెంగళూరు ఎన్‌ఈసీ తీర్మానం ప్రకారం గాంధీ జయంతిని 'పనిచేస్తున్న పాత్రికేయుల డిమాండ్ల దినం'గా పాటిస్తూ నిరసన తెలిపి, అనంతరం జిల్లా కలెక్టరేట్ లో డిమాండ్ల తో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ...సమగ్ర మీడియా కమిషన్ మరియు నూతన వేజ్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలి అని,జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక కేంద్ర, రాష్ట్ర చట్టాలు తీసుకురావాలి అనిరద్దయిన 1955, 1958 వర్కింగ్ జర్నలిస్ట్ చట్టబద్ధమైన రక్షణలను పునరుద్ధరించాలి అని,కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలి అని,ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే క్యాష్‌లెస్ చికిత్స అందించేలా హెల్త్ కార్డులు ఇవ్వాలి అని తదితర డిమాండ్లను పరిష్కరించాలని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు డిమాండ్ల పత్రాన్ని పంపడం జరిగిందని, అదే విధంగా తెలంగాణ ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐజేయు నాయకులు, తదితరులు పాల్గొన్నారు

## విద్యుద్ఘాతానికి గురైె సబ్ స్టేషన్ ఆపరేటర్‌కు తీవ్ర గాయాలు

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 02(ప్రభాత ఉదయం):**

కేటిదొడ్డి మండలం గంగన్‌పల్లి గ్రామంలోని 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఎల్ సి తీసుకునే క్రమంలో విద్యుద్ఘాతానికి గురై లైన్ మెన్ కు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. గంగన్ పల్లి సబ్‌స్టేషన్‌లో ఆర్టీజీఎన్ గ్రేడ్-2 ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న నజీర్ గురువారం రాత్రి గంగన్ పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎల్‌సి (రాజ) తీసుకునే క్రమంలో ఐసోలేటర్లను ఓపెన్ చేస్తుండగా అకస్మాత్తుగా ఎర్త్ అయి విద్యుత్ ప్రసరించింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలపాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన తోటి సిబ్బంది వెంటనే స్పందించి, చికిత్స నిమిత్తం ఆయనను కర్నూలు ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు.



## ఖాజాగూడ జంక్షన్‌లో పైప్‌లైన్ పనులు పూర్తి.. నీటి సరఫరా పునరుద్ధరణ

**హైదరాబాద్, అక్టోబర్ 2(ప్రభాత ఉదయం)**

జలమండలి ఖాజాగూడ జంక్షన్ వద్ద చేపట్టిన పైప్‌లైన్ జంక్షన్ అనుసంధాన పనులను జలమండలి ప్రణాళిక ప్రకారం విజయవంతంగా పూర్తి చేసింది. పనులను ఆపరేషన్ డైరెక్టర్ సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. అనంతరం అవసరమైన సాంకేతిక తనిఖీలు నిర్వహించి, ప్రశాసన్‌నగర్ నుంచి గచ్చిబౌలి రిజర్వాయర్‌కు నీటి సరఫరాను పునరుద్ధరించారు. ప్రస్తుతం నీటి సరఫరా సాధారణ స్థితికి చేరుకుంటోందని జలమండలి అధికారులు తెలిపారు.



## గాంధీజీ సత్యం అహింసా మార్గాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శం

### శాంతి సామరస్యం, సోదరభావం పెంపొందించాలి:

### సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్

**శేరిలింగంపల్లి : అక్టోబర్ 2, (ప్రభాత ఉదయం)**

మహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి, క్రమశిక్షణ మార్గాలు నేటి సమాజానికి కూడా ఆదర్శప్రాయమని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతి సందర్భంగా సైబరాబాద్ కమిషనరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ రమేష్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మా గాంధీజీ చేసిన త్యాగాలు, పోరాటం చిరస్మరణీయమని అన్నారు. సత్యం, అహింసను ఆయుధాలుగా చేసుకుని ప్రజల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించిన గాంధీజీ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గాంధీజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీ పిలుపునిచ్చారు. ప్రజలకు న్యాయం చేయడం, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించడం, సమాజ సేవకు అంకితభావంతో పనిచేయడం పోలీసుల ప్రధాన కర్తవ్యమని స్పష్టం చేశారు. గాంధీజీ కలలుగన్న స్వచ్ఛమైన, శాంతియుతమైన, సమానత్వ సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ అన్నపూర్ణ, హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, హెడ్‌క్వార్టర్స్ అడిషనల్ డీసీపీలు షమీర్, హన్మంత్ రావుతో పాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




జాతిపిత గాంధీజీకి నివాళులర్పిస్తున్న సైబరాబాద్ సీపీ డాక్టర్ రమేష్..

## క్షణికావేశం.. తల్లిదండ్రులకు తీరని కడుపుకోత

### పీజీ వైద్య విద్యార్థిని అనుమానాస్పద మృతి యువతకు కనువిప్పు కావాలి

**శేరిలింగంపల్లి : అక్టోబర్ 2,(ప్భాత ఉదయం)**

చేతిలో వైద్య విద్య.. ఉజ్వల భవిష్యత్తు.. కన్నవారి ఎన్నో ఆశలు.. కానీ ఓ ఘటనతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. 27 ఏళ్ల పీజీ వైద్య విద్యార్థిని కొమటి సృజన మియాపూర్‌లోని ఓ హోటల్ గదిలో అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం కలకలం రేపింది. హనుమకొండలో మొదటి సంవత్సరం పీజీ పీడియాట్రిక్స్ చదువుతున్న సృజన సెప్టెంబర్ 30న హైదరాబాద్‌కు వచ్చిన అనంతరం కనిపించకుండా పోయారు. ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతుండగా.. మొబైల్ ఫోన్ లొకేషన్ ఆధారంగా పోలీసులు మియాపూర్‌లోని హోటల్ గ్రాండ్ బ్రోచిల్‌ను గుర్తించారు. హోటల్‌లోని 502వ గదిని స్పేర్ కీతో తెరిచి చూడగా మంచంపై సృజన మృతదేహం కనిపించింది.



పీజీ విద్యార్థిని సృజన ఫోటో..

తండ్రి ఫిర్యాదుతో దర్యాప్తు: మృతురాలి తండ్రి కె. భూమయ్య ఇచ్చిన ఫిర్యాదులో రవి కుమార్ అనే వ్యక్తి గతంలో తన కుమార్తె బంగారు గొలుసును తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఆ తర్వాతే సృజన హైదరాబాద్‌కు వచ్చినట్లు ఫిర్యాదులో తెలిపారు. ఈ అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతికి గల పూర్తి కారణాలు, ఘటనకు ముందు ఏం జరిగిందనే విషయాలను పోలీసులు విచారిస్తున్నారు.

యువతకు ఓ గుణపాఠం: జీవితంలో ఎదురయ్యే సమస్య ఎంత పెద్దదిగా కనిపించినా.. క్షణికావేశంలో తీసుకునే నిర్ణయం జీవితాన్నే మార్చేయవచ్చు. చదువు, ఉద్యోగం, ప్రేమ, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు కారణం ఏదైనా సరే సమస్యకు పరిష్కారం ప్రాణాలు తీసుకోవడం కాదు. ఒక్క క్షణం ఆలోచించి, మనసులోని బాధను కుటుంబ సభ్యులతో, స్నేహితులతో లేదా నమ్మకమైన వ్యక్తులతో పంచుకుంటే పరిస్థితి మారే అవకాశం ఉంటుంది. అవసరమైతే మానసిక ఆరోగ్య నిపుణుల సహాయం తీసుకోవాలే తప్ప ప్రాణం తీసుకొని కలలు కన్నా తల్లిదండ్రులకు రోదన మిగిస్తున్నారు. ఒక వ్యక్తి తీసుకునే క్షణిక నిర్ణయం.. అతని లేదా ఆమె జీవితాన్నే కాదు.. కన్నవారి జీవితాంతం మిగిలే కడుపుకోతగా మారుతుంది.

సృజన ఘటన యువతలో ఆత్మపరిశీలనకు దారితీసి, ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా సమస్యను ఎదుర్కొనే ధైర్యాన్ని కలిగించాల్సిన అవసరం ఉంది. మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

# తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎర్రదొడ్డి భాస్కర్ రెడ్డి నియామకం

## పేద రెడ్డి కుటుంబాల సంక్షేమం, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు, రెడ్డి కార్పొరేషన్ సాధనకు కృషి చేస్తా

**కూకట్ పల్లి, అక్టోబర్ 2 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎర్రదొడ్డి భాస్కర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర నాయకులు ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యదర్శిగా కీలక బాధ్యతలు అప్పగించిన సంఘం నాయకత్వానికి భాస్కర్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎర్రదొడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణలోని పేద, ఆర్థికంగా వెనుకబడిన రెడ్డి కుటుంబాల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన రెడ్డి కుటుంబాలకు అండగా నిలవడం, వారి సమస్యలను సంబంధిత ప్రభుత్వ శాఖలు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడం తన ప్రాధాన్యతలని తెలిపారు. రెడ్డి సామాజిక వర్గంలోని పేద విద్యార్థులకు ఉన్నత విద్య, విదేశీ విద్య అభ్యసించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందేలా కృషి చేయడంతో పాటు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు వర్తించే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక



కార్యక్రమాలు చేపడతానన్నారు. అదేవిధంగా రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు, దాని ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక, సామాజిక ప్రయోజనాలు కల్పించే అంశాలపై సంఘం నాయకత్వంతో కలిసి ప్రభుత్వంపై దృష్టి సారిస్తానని వెల్లడించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద రెడ్డి కుటుంబాలు ఎదుర్కొంటున్న ఆర్థిక, విద్యా, ఉపాధి సంబంధిత సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సంఘం తరఫున నిరంతరం కృషి చేస్తానని భాస్కర్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అర్హులకు అవగాహన కల్పించి, వాటి ప్రయోజనాలు పొందేలా అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తానని పేర్కొన్నారు. సమాజంలోని నిరుపేదలు, నిరుద్యోగ యువత, విద్యార్థులకు అవసరమైన సహకారం అందించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తన నియామకానికి సహకరించిన తెలంగాణ రెడ్డి సంఘం అధ్యక్షుడు బద్దూరి వెంకటేశ్వర్ రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు నల్ల సంజీవ రెడ్డి, ప్రధాన వ్యవస్థాపక కార్యదర్శి కొట్టం మధుసూదన్ రెడ్డిలకు భాస్కర్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సంఘం నాయకులు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, వారి మార్గదర్శకత్వంలో సంఘం ఐక్యత, అభివృద్ధి, బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానన్నారు. రెడ్డి సామాజిక వర్గంలోని పేద కుటుంబాల అభ్యున్నతి, విద్యా, ఆర్థిక సాధికారత, సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రెడ్డి సంఘం చేపట్టే ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటూ, రాష్ట్రవ్యాప్తంగా సంఘాన్ని మరింత విస్తరించేందుకు కృషి చేస్తానని ఎర్రదొడ్డి భాస్కర్ రెడ్డి స్పష్టం చేశారు.



# భారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన మహాత్మా గాంధీ సేవలు చిరస్మరణీయం

## మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్

**కూకట్ పల్లి, అక్టోబర్ 2 (ప్రభాత ఉదయం)**

భారతదేశానికి స్వాతంత్రం రావడానికి మహాత్మా గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని జనసేన పార్టీ రాష్ట్ర జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గం, కూకట్ పల్లి కె పి హెచ్ బి 5వ ఫేజ్ జనసేన పార్టీ కార్యాలయంలో మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా జనసేన పార్టీ రాష్ట్ర జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ గాంధీ పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ చూపించిన సత్యం, శాంతి, అహింస మార్గాలు మనందరికీ ఎల్లప్పుడు మార్గదర్శకంగా నిలవాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గ జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.



# గాంధీ మహాత్ముడి సిద్ధాంతాలు ఆదర్శనీయం

## కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు వి.చంద్రారెడ్డి, జైపాల్ రెడ్డి

**పటాన్ చెరు, అక్టోబర్ 2 (ప్రభాత ఉదయం):**

మహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింస, స్వచ్ఛత సిద్ధాంతాలు ప్రపంచానికి ఆదర్శప్రాయమని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు వి.చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం బొల్లారం డివిజన్ పరిధిలోని బీ.సీ కాలనీలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో చంద్రారెడ్డి , కాంగ్రెస్ పార్టీ బొల్లారం అధ్యక్షుడు జైపాల్ రెడ్డి ముఖ్యఅతిథిలుగా పాల్గొని స్థానికులతో కలిసి మహాత్ముడి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్ముడు చూపిన సత్యం. అహింసా. స్వచ్ఛత సిద్ధాంతాలు ప్రపంచానికి ఆదర్శనీయమన్నారు. మహాత్ముడు చూపిన బాటలోనే అందరూ ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కౌన్సిలర్ గోపాలమ్మ, మాజీ ఎంపీటీసీ కృష్ణంరాజు, స్థానిక నాయకులు దీననాథ్, బీరప్ప, నానీ, విశ్వనాథ్, వెంకట్, కుమార్, రాములు, నవీన్, పార్టీ కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.



# రహదారులపై అక్రమ పార్కింగ్‌కు అడ్డుకట్ట వేయాలి

## వివేకానంద నగర్ చౌరస్తా నుంచి సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వరకు ఆక్రమణల తొలగింపు

## రోడ్లపై వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తప్పవు: ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

**కూకట్‌పల్లి, అక్టోబర్ 2 (ప్రభాత ఉదయం)**

రహదారులపై అక్రమ పార్కింగ్‌ను నివారించి, వాహనదారులు, పాదచారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకుంటామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, శాసనసభ ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) చైర్మన్ అరికెపూడి గాంధీ స్పష్టం చేశారు. ఈ మేరకు వివేకానంద నగర్ చౌరస్తా నుంచి సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వరకు రహదారిపై అక్రమంగా నిలిపిన కార్లు, ఆటోలు, ఏర్పాటు చేసిన షెడ్లను తొలగించే కార్యక్రమాన్ని ఆయన ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ రహదారులపై వాహనాలను ఇష్టానుసారంగా నిలపడం, రాకపోకలకు ఆటంకం కలిగించేలా షెడ్లు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా రద్దీగా ఉండే ప్రధాన రహదారులపై అక్రమ పార్కింగ్ కారణంగా తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని రహదారులపై ఉన్న వాహనాలను, అడ్డంకులను తొలగించి రాకపోకలకు మార్గం సుగమం చేయాలని అధికారులను ఆదేశించారు. వివేకానంద నగర్ చౌరస్తా నుంచి సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వరకు ఉన్న దుకాణాల యజమానులు, వ్యాపారులు రహదారులపై వాహనాలను పార్కింగ్ చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. రహదారులపై వాహనాలను నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, రహదారులను ఆక్రమించకుండా సహకరించాలని కోరారు..ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి పోలీసు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. రహదారులపై అక్రమ పార్కింగ్‌ను అరికట్టడంతో పాటు, భవిష్యత్తులో తిరిగి ఆక్రమణలు ఏర్పడకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. ప్రజల రాకపోకలకు ఆటంకం కలగకుండా రహదారులను అందుబాటులో ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ ఫిలిప్స్, ఆయన సిబ్బంది, జె. పురేందర్ రెడ్డి, రామకృష్ణ వెల్ఫేర్ అధ్యక్షుడు జనంపల్లి పురంధర్ రెడ్డి, ఎన్. చంద్రకాంతరావు, జి. నర్సింగ్‌రావు, లక్ష్మీనారాయణ, శ్రీధర్, సూర్యనారాయణ, జి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రపంచానికి ఆదర్శప్రాయుడు జాతిపిత మహాత్మా గాంధీ

## ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

## పటాన్చెరు లో ఘనంగా గాంధీ మహాత్ముడి జయంతి వేడుకలు.

**పటాన్ చెరు, అక్టోబర్ 2 (ప్రభాత ఉదయం):**

ప్రపంచానికి ఆదర్శప్రాయుడు జాతిపిత మహాత్మా గాంధీ అని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మహాత్మా గాంధీ జయంతి ని పురస్కరించుకొని పటాన్ చెరు పట్టణంలోని గాంధీ థీమ్ పార్క్ లో గల మహాత్మా గాంధీ కాంస్య విగ్రహానికి ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సత్యం, అహింస పద్ధతుల ద్వారా దేశానికి స్వతంత్రం తీసుకు వచ్చిన మహోన్నత నాయకుడు మాత్మ గాంధీ అని కొనియాడారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని అన్నారు. నేటి తరాలకు మహాత్మా గాంధీ చరితను తెలియజేసే విధంగా ప్రతి గ్రామపంచాయతీ ఆవరణలో విగ్రహాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రధాన కూడళ్లలో సైతం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, వెంకటేష్, హమీద్, నాయకులు, పట్టణ పుర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.



# గడ్డపోతారం పురపాలక సంఘంలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

## అయ్యమ్మ చెరువు వద్ద మున్సిపల్ ప్రజాప్రతినిధులు, సిబ్బంది శ్రమదానం

**పటాన్ చెరు, అక్టోబర్ 2 (ప్రభాత ఉదయం):**



జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం గడ్డపోతారం పురపాలక సంఘం కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని గాంధీ విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మా, వైస్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ తో పాటు కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస, పరిశుభ్రత అనే మార్గాలు నేటి సమాజానికి ఎంతో ఆదర్శనీయమని ప్రజాప్రతినిధులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం స్వచ్ఛతా కార్యక్రమంలో భాగంగా స్థానిక అయ్యమ్మ చెరువు వద్ద ప్రత్యేక శ్రమదాన కార్యక్రమాన్ని చేపట్టారు. చెరువు పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని స్వయంగా తొలగించి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌తో పాటు వార్డు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# క్యాష్ లెస్ హెల్త్ కార్డులపై జర్నలిస్టుల పోస్ట్ కార్డు ఉద్యమం

**పటాన్ చెరు, అక్టోబర్ 2( ప్రభాత ఉదయం):**

టీడబ్ల్యూజే హెచ్--143 పిలుపు మేరకు సంగారెడ్డిలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి పటాన్‌చెరు నియోజకవర్గ యూనియన్ నాయకులు శుక్రవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి నాయకులతో కలిసి జర్నలిస్టులకు క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ పోస్టుకార్డు ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులు యూనియన్ తరపున ర్యాలీ నిర్వహించి స్థానిక జనరల్ పోస్ట్ కార్యాలయం వద్ద పోస్ట్ బాక్స్ లో లేఖలు వేశారు. జర్నలిస్టుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని క్యాష్‌లెస్ వైద్య సదుపాయాన్ని త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజే హెచ్--143 నియోజకవర్గ నాయకులు శేఖర్ గౌడ్, మహేష్ గౌడ్, సాయికుమార్, ప్రదీప్ రాజ్, ప్రవీణ్ జింకల, శ్రీనివాస్, రమేష్, సంతోష్, మహేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జిన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలోకి గడ్డపోతారం మున్సిపాలిటీకి చెందిన 11 గ్రామాలు

## ఈనెల 2 నుంచే ఉత్తర్వులు అమల్లోకి వచ్చినట్లు ఐడీఏ బొల్లారం ఇన్‌స్పెక్టర్ వి. సుధీర్ కుమార్ పత్రికా ప్రకటన

**పటాన్ చెరు, అక్టోబర్ 2 ( ప్రభాత ఉదయం):**



పోలీస్ స్టేషన్ల ప్రాదేశిక పరిధుల పునర్వ్యవస్థీకరణలో భాగంగా గడ్డపోతారం పురపాలక సంఘం పరిధిలోని 11 గ్రామాలు జిన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలోకి మారి పోయాయి. ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ నంబర్ 85, 88 ప్రకారం ఈ మార్పులు చేపట్టినట్లు ఉన్నతాధికారులు విడుదల చేసిన పత్రాలతో కూడిన వివరాలను ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వి. సుధీర్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. ఇప్పటివరకు ఈ ప్రాంతాలు ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో కొనసాగగా, శుక్రవారం (అక్టోబర్ 2, 2026) నుంచి అధికారికంగా సంగారెడ్డి జిల్లాలోని జిన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలోకి బదిలీ అయ్యాయని ఆ ప్రకటనలో ఉన్నట్లు ఆయన తెలిపారు.జిన్నారం పరిధిలోకి వెళ్లిన ఖాజిపల్లి,గూడెం, గొల్లగూడెం,గడ్డపోతారం,చెట్లపోతారం,అలీనగర్, కిష్టాయిపల్లి,దాచారం, మాదారం,దుర్వకుంట, మంత్రికుంట గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, పోలీసు బందోబస్తు, రాత్రి-పగలు పెట్రోలింగ్, ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ, కేసుల నమోదు, దర్యాప్తు తదితర విధులను జిన్నారం పోలీసులే ప్రత్యక్షంగా నిర్వహించనున్నారు.కాబట్టి, ఈ 11 గ్రామాల పరిధిలోని ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులు, ఇతర పోలీసు సేవల కోసం ఇకపై ఐడీఏ బొల్లారం కాకుండా జిన్నారం పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ వి. సుధీర్ కుమార్ సూచించారు. ఈ మార్పును స్థానిక ప్రజలు గమనించి పోలీసు శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608